సాక్షి
ఆదిలాబాద్

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



ఆర్టీసీకి 'రాఖీ' పండుగ..!
ఆర్టీసీకి రాఖీ పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడపడంతో లక్ష్యానికి మించి ఆదాయం సమకూరింది. 8లో▸

నాలుగు నెలలకే కడతేర్చాడు..
మూడు ముళ్ల బంధానికి.. నాలుగు నెలలకే.. నూరేళ్లు నిండాయి. కట్టుకున్న వాడే కాల యముడయ్యాడు. అనుమానం రెండు నిండు జీవితాలను బలితీసుకుంది.



8లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /26.0
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన డీఎఫ్‌వో



ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న డీఎఫ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్‌ఓ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్ పాటిల్ బాజిరావ్ శుక్రవారం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి పూలమొక్క అందజేశారు.

సందేహాల నివృత్తికి టెట్ సెల్ ఏర్పాటు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో టెట్ (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) రాసే అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం డీఈవో కార్యాలయంలో టెట్ సెల్ ఏర్పాటు చేసినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. సందేహాలు నివృత్తితో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం 08732-226434, 7995087613, 96186 01585 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'ఇన్‌స్పైర్' నామినేషన్ గడువు పొడిగింపు

ఆదిలాబాద్‌టౌన్: ఇన్‌స్పైర్ మానక్ నామినేషన్ల గడువు ఈనెల 30 వరకు పొడిగించినట్లు డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 6,7 తరగతులకు సంబంధించిన విద్యార్థులు ఒక్కొక్కరిని, ఉన్నత పాఠశాలల నుంచి కనీసం ఐదుగురు చొప్పున నామినేట్ చేయాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల బ్యాంక్ ఖాతాలో రూ.10వేల చొప్పున డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 9440060288 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న పార్థసారథి

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాలబాలికల ఖోఖో ఎంపిక పోటీలు పట్టణంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. 17 ఏళ్ల విభాగంలో నిర్వహించిన పోటీలకు జిల్లా వ్యాప్తంగా 250 మంది హాజరయ్యారు. పోటీలను గిరిజన క్రీడల అధికారి పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాకారులు తమ ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఆగస్టీన్, వైస్ ప్రిన్సిపాల్ ఫణీందర్, కోఆర్డినేటర్ మారుతి శర్మ, గురుకులం స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు పద్మశాలీ శంఖారావం



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఎదులాపురం: హైదరాబాద్ ఎల్బీనగర్ స్టేడియంలో ఈనెల 3న నిర్వహించ తలపెట్టిన పద్మశాలీ శంఖారావం బహిరంగ సభ విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ కోరారు. సభకు సంబంధించిన వాల్ పోస్టర్ ను జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పద్మశాలీ సమాజం ప్రభుత్వ పథకాల్లో, రాజకీయ వాటాలో వివక్షకు గురవుతోందని, హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందులో జిల్లా కన్వీనర్ జక్కుల సత్యనారాయణ, తాలూకా అధ్యక్షుడు రమేశ్, రాష్ట్ర కార్యదర్శి కామన్ విఠల్, నాయకులు ఆశన్న, రమేష్, విలాస్, ఉషన్న తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ వచ్చేసింది

- బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ఇక వేగవంతం
- వచ్చే నెల 3 వరకు పూర్తి చేసేలా ప్రణాళిక
- ఉపాధ్యాయుల్లో హర్షం



ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ఇక ఊపందుకోనుంది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన శుక్రవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 3 నుంచి ప్రక్రియ షురూ కానుంది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం ఆ శాఖాధికారులతో సమీక్షించారు. హైకోర్టు నుంచి బదిలీ, పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ లభించిన నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా షెడ్యూల్ సైతం విడుదల చేసింది. దీంతో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఉపాధ్యాయుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. పదోన్నతుల తర్వాత ఖాళీ అయ్యే పోస్టులను డీఎస్సీ (టీఆర్‌టీ) ద్వారా భర్తీ చేయనుండడంతో నిరుద్యోగ అభ్యర్థుల్లోనూ హర్షం వ్యక్తమవుతుంది. విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యాబోధన అందనుంది.

షెడ్యూల్ విడుదల

పాఠశాల విద్యాశాఖ రాష్ట ఉన్నతాధికారులు ప్రతిపాదిత షెడ్యూల్‌ను నివేదించగా దానిని ప్రభుత్వం శుక్రవారం ఓకే చేసింది. సెప్టెంబర్ 1 వరకు బదిలీలకు కటాఫ్ డేట్ ప్రకటించారు. ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్లు పనిచేసిన వారికి తప్పనిసరిగా బదిలీ కానున్నారు. అలాగే ఐదేళ్లు పనిచేసిన హెచ్‌ఎంలకు తప్పనిసరిగా స్థానచలనం కలుగుతుంది. ఉద్యోగ విరమణకు మూడేళ్ల సర్వీసు ఉన్నవారికి మాత్రం బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. గతంలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు మరోసారి ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించారు. స్పౌజ్ ఉపాధ్యాయులు పాయింట్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. సెప్టెంబర్ 1 నాటికి 50ఏళ్ల లోపు ఉండి బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీ వర్తింపజేశారు.

దాదాపు 1500 మందికి స్థానచలనం..

జిల్లాలో దాదాపు 1500 మంది వరకు టీచర్లకు స్థానచలనం జరిగే అవకాశం ఉంది. గతంలో బదిలీ కోసం జిల్లాలో 1605 మంది దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 1 వరకు కటాఫ్ డేట్ ఇవ్వడంతో బదిలీల కోసం 500 కంటే ఎక్కువగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఒకేచోట ఐదేళ్ల పాటు పనిచేసిన ప్రధానోపాధ్యాయులు 18 మంది ఉండగా, ఎనిమిదేళ్ల పాటు ఒకేచోట పనిచేసిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, భాషా పండితులు 1,102 మంది ఉన్నారు. వీరందరికీ తప్పనిసరిగా స్థానచలనం జరగనుంది. జిల్లాలో మంజూరు పోస్టులు 3,028 ఉండగా, ప్రస్తుతం 2,480 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 548 ఖాళీలు ఉన్నాయి. అయితే 45 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి లభించనుంది. అలాగే ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులు 185 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించనున్నాయి. మొత్తం 230 మంది పదోన్నతులు పొందనున్నారు. కోర్టు కేసు కారణంగా భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు నిలిచిపోయిన విషయం విదితమే.

షెడ్యూల్ ఇలా..

- ఈనెల 3 నుంచి 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 6, 7, 8 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించడం
- 8, 9 తేదీల్లో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను ప్రదర్శించడం
- 10, 11 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ
- 12, 13 తేదీల్లో సీనియారిటీ జాబితా ప్రదర్శన
- 14న ఎడిట్ ఆప్షన్
- 15న ఆన్‌లైన్ ద్వారా ప్రధానోపాధ్యాయుల బదిలీలు
- 16న ప్రధానోపాధ్యాయుల ఖాళీల ప్రదర్శన
- 17, 18, 19 తేదీల్లో ఎస్‌ఏలకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి
- 20, 21 తేదీల్లో ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ప్రదర్శన
- 21న వెబ్ ఆప్షన్
- 22న ఎడిట్ ఆప్షన్
- 23, 24 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు
- 24న స్కూల్ అసిస్టెంట్ ఖాళీల ప్రదర్శన
- 26, 27 , 28 తేదీల్లో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు
- 29, 30, 31 తేదీల్లో ఎస్జీటీల ఖాళీల ప్రదర్శన
- అక్టోబర్ 2న ఎడిట్ ఆప్షన్
- 3న ఎస్జీటీ భాషా పండిత, పీఈటీల బదిలీలు
- 5 నుంచి 19 వరకు అప్పీల్‌కు అవకాశం

పారదర్శకంగా ప్రక్రియ



ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టనున్నాం. ఉపాధ్యాయుల వివరాలు సేకరణ కొనసాగుతంది.

– ప్రణీత, డీఈవో

మావల కేజీబీవీలో పోస్టులకు నేడు నియామక ప్రక్రియ

ఆదిలాబాద్‌టౌన్: కొత్తగా మంజూరైన మావల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో సీఆర్టీ, పీజీ సీఆర్టీ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. జూలైలో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్ష ద్వారా అర్హులైన అభ్యర్థులను మెరిట్, రోస్టర్ విధానంలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 1:3 పద్ధతిన డీఈవో కార్యాలయంలో శనివారం నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. డీఈవో వెబ్‌సైట్‌లో అర్హులైన అభ్యర్థుల వివరాలు పొందుపరిచినట్లు తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ 1, సీఆర్టీ బయోసైన్స్ 2, తెలుగు 2, హిందీ 1, సాంఘిక శాస్త్రం 1, పీఈటీ 1, ఇంగ్లిష్ 4, సీఆర్టీ గణితం 1, ఫిజికల్ సైన్స్ 2, పీజీ సీఆర్టీ ఇంగ్లిష్ 1, పీజీ సీఆర్టీ తెలుగు 1 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వివరించారు.

3న జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్ రాక

కైలాస్‌నగర్: జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షేహజాదీ ఈ నెల 3, 4వ తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 3న జిల్లా కేంద్రానికి చేరుకుని బస చేస్తారని పేర్కొన్నారు. 4న ఉదయం 11గంటలకు మైనార్టీల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. 12.30గంటలకు పీఎంఎస్ న్యూ 15 పాయింట్స్ కార్యక్రమ లబ్ధిదారులతో సమావేశమవుతారని తెలిపారు. పీఎంజేవీకే నిధులతో చేపట్టిన జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను పరిశీలిస్తారని తెలిపారు.

రిమ్స్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రిమ్స్ కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు శుక్రవారం రిమ్స్ ఓపీ బ్లాక్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ, రిమ్స్‌లో పనిచేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డులు సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. జీవో నం.60 ప్రకారం రూ.15,600 వేతనం చెల్లించాల్సి ఉండగా, రూ.11వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో సుభాష్, రమేశ్, అనసూయ, సుమన్, రమాకాంత్, దేవిదాస్, గంగన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సీనియర్ రెసిడెంట్లు



రిమ్స్ డైరెక్టర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రికి ప్రభుత్వం ఇటీవల 39 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులను కేటాయించింది. ఇందులో భాగంగా శుక్రవారం నలుగురు రెసిడెంట్లు విధుల్లో చేరినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఈనెల 5 వరకు మిగతా వారు సైతం విధుల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు. వీరు రిమ్స్‌లో ఏడాది పాటు విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల చేరిక..

జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు రిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధుల్లో చేరారు. ప్రభుత్వం పీజీ పూర్తి చేసిన వైద్యులను మెడికల్ కళాశాలలకు కేటాయించింది. ఇందులో భాగంగానే వీరు రిపోర్టు చేశారు. తాంసి మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వాణి జనరల్ మెడిసిన్ విభాగంలో, భీంపూర్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ విజయసారధి జనరల్ సర్జన్ విభాగంలో విధుల్లో చేరినట్లు రిమ్స్ డైరెక్టర్ తెలిపారు.

సీఈఐఆర్ పోర్టల్‌తో ఫోన్ల రికవరీ

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పోగొట్టుకున్న 9 మొబైల్ ఫోన్లను బాధితులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడిచిన మూడు నెలల్లో ఈ పోర్టల్ ద్వారా ఫోన్లను ట్రాక్ చేసి 21 మంది బాధితులకు అందించినట్లు తెలిపారు. వన్‌టౌన్‌లో 1, టూటౌన్‌లో 2, మావలలో 1, ఆదిలాబాద్‌రూరల్ 1, ఇంద్రవెల్లి 1, గుడిహత్నూర్ 2, తలమడుగులో ఒక మొబైల్‌ను రికవరీ చేసి అందించినట్లు చెప్పారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఉమేందర్, శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, సంజీవ్ కుమార్, లక్ష్మణ్, రాహత్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' ప్రవేశాల గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల గడువు పొడిగించినట్లు డీఈవో ప్రణీత, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ ప్రకటనలో తెలిపారు. గతనెల 31వరకు దరఖాస్తుకు అవకాశం ఉండగా, దానిని ఈనెల 21 వరకు పొడిగించగా, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాల కోసం అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

వారు మారరు.. వీరు పట్టించుకోరు!





ఆదిలాబాద్ పట్టణంలోని జెడ్పీ కార్యాలయం ఎదుట నడి రోడ్డుపై పశువుల సంచారం ఇలా..

రక్తమోడుతూ పడి ఉన్న ఈ మూగజీవిని చూశారా.. గత నెల 20వ తేదీ అర్ధరాత్రి కుమ్మరివాడలోని శివాలయం సమీపంలో బైక్‌పై వెళ్లే యువకులు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆవు సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న యువకులు గాయాలతో బయటపడ్డారు.

పట్టణంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన దంపతులు ఇటీవల బైక్‌పై వినాయక్ చౌక్‌కు వెళ్లే క్రమంలో ఎన్టీఆర్ చౌక్ వద్ద పశువులు అడ్డురావడంతో వాటిని ఢీకొని కిందపడ్డారు. అదృష్టవశాత్తు వెనుక నుంచి ఎలాంటి వాహనం రాకపోవడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు.

- పశువుల తరలింపు ప్రకటనలకే పరిమితం
- చర్యలకు వెనుకాడుతున్న బల్దియా
- రోడ్లపై పరిపాటిగా ప్రమాదాలు
- ఇబ్బందుల్లో జనం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని పలు రహదారులపై మూగజీవాల సంచారం ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. పాత జాతీయ రహదారితో పాటు పట్టణంలోని ప్రధాన రోడ్లపై పశువులు యథేచ్ఛగా తిరుగుతుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో మూగజీవాలు మృత్యువాతపడుతుండగా.. వాహనాదారులు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. వీటి సంచారాన్ని కట్టడి చేయాల్సిన బల్దియా యంత్రాంగం పదే పదే ప్రకటనలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. రోడ్లపై తిరిగే పశువులను తరలించి సంరక్షించేందుకు డంపింగ్‌యార్డులో గోశాల ఏర్పాటు చేసినా మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలోపంతో అది ప్రారంభానికే పరిమితమై నిర్వహణకు నోచుకోవడం లేదు.

ఆగని పశువుల సంచారం

మావల బైపాస్ నుంచి చాంద–టి వరకు గల పాత జాతీయ రహదారి పట్టణంలో నుంచే వెళుతుంది. ఈ రహదారిపై రాంనగర్ నుంచి మొదలు తిర్పెల్లి పెట్రోల్ బంక్ వరకు పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. దస్నాపూర్, రిమ్స్ ఆసుపత్రి, కలెక్టరేట్‌చౌక్, బస్టాండ్, పంజాబ్‌చౌక్ వద్ద గుంపులుగా సంచరించడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిపైనే కాదు పట్టణంలోని ప్రధాన రోడ్లైన వినాయక్‌చౌక్, రైతు బజార్, అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్ వంటి వివిధ ప్రాంతాల్లోనూ వీటి సంచారం యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా ఇరుకు రోడ్లపై వీటి సంచారం వాహనదారులను బెంబేలెత్తిస్తోంది. ఏమాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా ప్రమాదానికి గురి కావాల్సిందే. ఇప్పటికే పలు చోట్ల ప్రమాదాలు జరిగి మూగజీవాలు మృత్యువాత పడగా, పలువురు వాహనదారులు గాయాలతో ఆసుపత్రుల బాట పట్టారు.

కనిపించని కట్టడి చర్యలు

రోడ్లపై మూగజీవాల సంచారాన్ని కట్టడి చేయాల్సిన బల్దియా యంత్రాంగం నామమాత్రంగా వ్యవహరిస్తుందనే విమర్శలున్నాయి. రోడ్లపై తిరిగే పశువులను తమ ఆధీనంలో ఉంచుకోవాలని లేకుంటే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామనే బల్దియా అధికారుల హెచ్చరికలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. వారి ఉదాసీన వైఖరి కారణంగా పశువుల యజమానులు వారి ఆదేశాలు లెక్క చేయడం లేదు. ఫలితంగా రోడ్లపై పశువుల సంచారం పెరిగి ప్రమాదాలు పరిపాటిగా మారాయి. ఈ పశువులను కట్టడి చేసి సంరక్షించేందుకు బంగారుగూడలో మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేసినా అది ప్రారంభానికే పరిమితమైంది తప్ప నిర్వహణ కానరాని పరిస్థితి. వీటిని నియంత్రించాలని పలు రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాల నుంచి ఫిర్యాదులు అందుతున్నా అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చర్యలు చేపడుతున్నాం

ప్రజల ఇబ్బందులు తొలగించేలా రోడ్లపై తిరిగే పశువుల సంచారాన్ని కట్టడిచేసేలా చర్యలు చేపడుతున్నాం. సంబంధిత యజమానులను ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. మున్సిపల్ ఆధ్వర్యంలో ఈ రోజు(శుక్రవారం) నుంచే వాటిని గోశాలకు తరలించే చర్యలు చేపడుతున్నాం.

– ఏ.శైలజ, మున్సిపల్ కమిషనర్

నేడు, రేపు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం



పోస్టర్ విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: ఓటరు జాబితా సవరణలో భాగంగా ఈ నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం తన చాంబర్‌లో వాల్‌పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. శని, ఆదివారాల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు. అక్టోబర్ 1 నాటికి 18ఏళ్లు నిండిన వారు, ఓటరు జాబితాలో పేర్లు లేనటువంటి వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 4న తుది జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నలందప్రియ, డీఎస్‌వో కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రణదీవెనగర్‌కు చెందిన నివర్తి కాంబ్లే (45) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్‌కు చెందిన కాంబ్లే నివర్తి మద్యానికి బానిసయ్యాడు. రాఖీ పండుగ సందర్భంగా భార్య కాంబ్లే లత పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కుంటలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామానికి చెందిన జోగులే విఠల్(70) గ్రామ సమీపంలోని మామిడికుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ రామారావు వివరాల ప్రకారం హవర్గ గ్రామంలోని జోగులే విఠల్ కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. రెండు రోజులుగా అనారోగ్యం తీవ్రం కావడంతో శుక్రవారం గ్రామ సమీపంలోని మామిడి కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య చంద్రవ్వ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన సుధారపు రేణుక (60) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం... తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన రేణుక ఆగస్టు 24వ తేదీన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆటోలో మహారాష్ట్రలోని మహోర్ గ్రామానికి వెళ్తుండగా మార్గం మధ్యలో ఉండం గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ధనశ్రీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్డెపెల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పెంబి మండలంలోని వెంకంపోచంపాడ్ అనుబంధ గ్రామమైన గోదమల్లె గ్రామానికి చెందిన చెందిన సిడాం తుక్కారాం, సిక్కారాం సంబు ఇరువురు ద్విచక్రవాహనంపై శుక్రవారం గ్రామం నుంచి బ్యాంక్ పని నిమిత్తం ఖానాపూర్ వెళ్లారు. పనిముగింపుకొని ఇంటికి వెళ్లే క్రమంలో లక్ష్మణచాంద మండలంలోని వడ్డెపెల్లి వద్ద కుక్క అడ్డురావడంతో దానిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తుక్కారాంకు తీవ్ర గాయాలు కాగా సిక్కారాంకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మన్మద్‌లో మహారాష్ట్ర వలస కూలీ మృతి

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో మహారాష్ట్రలోని హిమయాత్‌నగర్ తాలుక లోని గణేష్‌నగర్ తండాకు చెందిన పవర్ రాజు (48) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని మన్మద్ గ్రామానికి గణేష్ నగర్ తండాకు పవర్‌రాజు బతుకుదెరువు కోసం మూడేళ్ల కింద వలస వచ్చాడు. అప్పటి నుంచి వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. గురువారం మన్మద్ గ్రామంలో ఓ రైతుకు చెందిన చేనులోకి వ్యవసాయ పనుల నిమిత్తం కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ మద్యం మత్తులో పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా...

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బస్సు డిపో సమీపంలో ఆటో అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... స్థానిక చైన్‌గేట్ నుంచి మంచిర్యాల చౌరస్తా వెళ్లే దారిలో ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని బోల్తాపడింది. వెంటనే స్థానికులు ఆటోను పైకి లేపే సమయంలో గేర్‌లో ఉండడంతో మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. వెంటనే స్థానికులు ఆటోని ఆఫ్ చేసి పక్కకు తీసుకెళ్లారు. ఈ సంఘటనతో ఎవరికి ఎటువంటి హాని జరగలేదు.

ఆర్టీసీకి రాఖీ పండుగ..!

- టార్గెట్‌కు మించి ఆదాయం
- ఆదిలాబాద్ రీజియన్‌లో మంచిర్యాల నంబర్-1
- ఆదిలాబాద్ రీజియన్‌లో ఆదాయం రూ.1,42,35,601
- ఒక్కోరోజు ఆదాయం 126.24శాతం



ఆదిలాబాద్: నష్టాల్లోని ఆర్టీసీకి రాఖీ పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను తిప్పటంతో అనుకున్న టార్గెట్‌కు మించి ఆదాయం సమకూరింది. రాఖీ పండుగ నేపథ్యంలో హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు పెరిగాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌కు ఉద్యోగ రీత్యా వెళ్లినవారు.. చదువుల నిమిత్తం ఉన్న విద్యార్థులందరూ సొంత ఊళ్లకు వచ్చి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. రోజువారీ బస్సుల కంటే అదనపు బస్సులను నడిపి ఆదాయం సమకూర్చుకుంది. రాఖీ పండుగ ఒక్కరోజు (గురువారం) ఆదిలాబాద్ రీజియన్‌లో రూ.1,12,76,453 ఆదాయ లక్ష్యసాధనకు రూ.1,42,35,601 సాధించింది. ఇందులో ఆరు డిపోల్లో మంచిర్యాల డిపోకు రూ.28,19,956 ఆదాయం టార్గెట్ విధించగా రూ.39,90,664 సాధించింది. రీజియనల్‌లో ముందు వరుసలో నిలచి ఫస్ట్ (నంబర్-1) స్థానం సాధించింది.

హైదరాబాద్ నుంచి ఎక్కువగా..

పండుగ నేపథ్యంలో జిల్లాకు అత్యధికంగా ప్రజలు హైదరాబాద్ నుంచి వస్తుంటారు. చదువు, ఉద్యోగంతో పాటు ఇతర అవసరాల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లివస్తుంటారు. రాఖీ పండుగ నేపథ్యంలో రద్దీ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రత్యేక బస్సులకు కేటాయించిన ట్రిప్పులకు అదనంగా తిప్పేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచారు. దీంతో అనుకున్న దానికంటే ఎక్కువ ఆదాయం సమకూరింది. ఎక్కువగా బస్సులు తిప్పటంతో లక్ష్యసాధన వైపు పరుగులు పెట్టింది. ఆదిలాబాద్ రీజియన్‌లో రాఖీ పండుగ ఒక్కరోజు 2,49,474 కిలో మీటర్లకు 2,65,582 (106.46శాతం) బస్సులు తిరిగాయి.

రీజియన్ పరిధిలో వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	ఆసిఫాబాద్	మంచిర్యాల	మొత్తం
ఆగస్టు 28న	22.46	12.48	27.35	4.2	14.21	30.07	110.77
29న	25.84	11.88	29.28	4.41	15.17	31.62	118.20
30న	27.33	14.26	31.41	5.10	17.42	36.12	131.64
31న	29.03	15.59	33.63	5.55	18.64	39.91	142.35

రీజియన్ పరిధిలో ఓఆర్ వివరాలు..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	ఆసిఫాబాద్	మంచిర్యాల	మొత్తం
ఆగస్టు 28న	68	69	72	66	68	75	71
29న	70	64	71	72	79	78	73
30న	75	75	79	78	82	87	80
31న	79	77	83	83	85	93	84

మంచిర్యాల ఫస్ట్..

ఆదిలాబాద్ రీజియన్‌లో ఆరు డిపోలో మంచిర్యాల డిపో ఆదాయ లక్ష్యసాధనలో నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. ప్రణాళిక ప్రకారం బస్సులు నడిపి అనుకున్న టార్గెట్‌ను మించిపోయింది. సాధారణ రోజుల్లో 60,895 కిలోమీటర్ల బస్సులు తిరగాల్సి ఉండగా పండుగ వేళ 66041 కిలోమీటర్లు తిప్పి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. రూ.28,19,956 ఆదాయం గాను రూ.38,90664 సాధించి రీజియన్‌లో మొదటి స్థానం నిలిచింది. ఈపీకే 46.31గాను 60.43 సాధించినట్లు మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సమిష్టి కృషితోనే అనుకున్న లక్ష్యసాధనకంటే మించి ఆదాయం వచ్చిందన్నారు.

అందరి కృషితోనే ఆదాయం



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగానే రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదాయం సమకూరింది. ప్రయాణికులు అవస్థలు పడకుండా ఎప్పటికప్పుడు బస్సులను ఏర్పాటు చేశాం. గతంలో అదనపు చార్జీలు ఉండేవి. అయితే ప్రస్తుతం అదనపు సర్వీసులను నడుపుతూ మెరుగైన సేవలు అందజేస్తున్నాం.
– ప్రణీత్, డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్స్)

ఎర్నింగ్ ఫర్ కిలోమీటరు (ఈపీకే) 45.2 గాను 53.60(118.59శాతం) సాధించింది. ఆక్యుపెన్సీ రేషియో 71కి 84 (118-53శాతం), ఎర్నింగ్ ఫర్ బస్సు (ఈపీబీ) 23,261 సాధించి మునుపెన్నడూ లేని విధంగా ఆర్టీసీ లాభాల బాట పట్టింది.

మట్కా జూదరుల అరెస్టు

ఇచ్చోడ: మండలంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం మట్కా ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. ఇందులో ఇచ్చోడకు చెందిన హర్షద్‌ఖాన్, షేక్ షఫీ పట్టుబడ్డారు. భైంసాకు చెందిన అజీమ్, ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన మహ్మద్ లతీఫ్ పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారి నుంచి మట్కా చిటీలు, రూ.62,570 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సీసీఎస్ సిబ్బంది ఎస్సై లక్ష్మణ్, సిరాజ్ ఖాన్, శ్రీనివాస్, రాహత్, గంగారెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడిపై కేసు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో మట్కా నిర్వహిస్తున్న ఒకరిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ మట్కా ఆడుతుండగా పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.2450, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఐదుగురికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జరిమానా, ఒక్కొక్కరికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. ఐదుగురికి రూ.4600 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

బైకులు పట్టివేత..

జిల్లా కేంద్రంలో షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్ కాకుండా మాడిఫైడ్ సైలెన్సర్ పెట్టుకుని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న బైకులను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ మాట్లాడుతూ.. డీఎస్పీ గంగారెడ్డి ఆదేశాల ప్రకారం జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్లు కాకుండా బైక్‌కు అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లను బిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీరనున్న రవాణా కష్టాలు



బ్రిడ్జి కింద వాగుపై కొనసాగుతున్న తాత్కాలిక వంతెన పనులు

- జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాత్కాలిక వంతెన
- తరోడ వాగుపై నిర్మాణ పనులు
- సుమారు రూ.40లక్షల అంచనా వ్యయం

జైనథ్: తరోడ బ్రిడ్జి కుంగిపోవడంతో గత ఆరు నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జైనథ్, బేల మండలాలతో పాటు మహారాష్ట్రను ఆదిలాబాద్‌తో కలిపే జాతీయ రహదారి ఉన్న బ్రిడ్జి కావడంతో ప్రజారవాణాకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈ బ్రిడ్జి గుండా రాకపోకలను నిషేదిస్తూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రెండు వైపులా గోడలు కట్టారు. వేసవి కాలంలో వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా లేకపోవడంతో అధికారులు తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసి ఎలాగోలా రాకపోకలు పునరుద్ధరించారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక వంతెన పూర్తిగా కొట్టుకుపోవడంతో రవాణా కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. దీంతో ప్రమాదమని తెలిసిన కూడా ప్రజలు కాలినడకన ద్విచక్ర వాహనాలపై ఈ బ్రిడ్జి గుండా రాకపోకలు నిర్వహిస్తున్నారు.

జోగుఫౌండేషన్ ఆధ్వర్యంలో జోరుగా పనులు...

జైనథ్-బేల మధ్య విస్తరించి ఉన్న 353-బీ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తరోడ వద్ద కొత్త బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నిధులు విడుదల చేయడంతో పాటు టెండర్లు కూడా పిలిచింది. ఈ పనులు పూర్తి కావడానికి సమయం పట్టే అవకాశం ఉండటంతో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు రూ.40లక్షలతో తాత్కాలిక వంతెన నిర్మిస్తున్నారు. తరోడ వాగుపై కాంక్రీట్ బెర్త్ ఏర్పాటు చేసి, దానిపై సిమెంట్ పైప్‌లను అమర్చి తాత్కాలిక వంతెన నిర్మాణానికి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. దాదాపు 120-10 సిమెంట్ పైప్‌లను వంతెన కోసం వాడుతున్నారు. వంతెన పనులు చేపడుతుండడంతో ఆయా మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండో అంతస్తు నుంచి జారిపడిన విద్యార్థి..

- తప్పిన పెనుప్రమాదం..
- ఓ ప్రైవేట్ పాఠశాలలో ఘటన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ వద్ద గల ఓ ప్రైవేట్ పాఠశాలలోని ఆరవ తరగతి విద్యార్థి చదువుతున్న విద్యార్థి రెండో అంతస్తు నుంచి శుక్రవారం ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. వివరాల ప్రకారం... సారంగాపూర్ మండలానికి చెందిన విద్యార్థి స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలోని హాస్టల్‌లో ఉంటూ ఆరవ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం రెండవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది విద్యార్థిని స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు చికిత్స అందించి ఎలాంటి ప్రమాదం సంభవించలేదని తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. విద్యార్థి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.? లేక విద్యార్థినే దూకాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ముగిసిన ట్రెయినీ ఐఏఎస్ అధికారుల పర్యటన



గిరిజనులతో ట్రెయినీ సర్వీసెస్ అధికారులు



గిరిజన పిల్లలతో ముచ్చటిస్తున్న ట్రెయినీ అధికారులు

సిరికొండ: ఐదు రోజుల నుంచి మండలంలోని రిమ్మ గ్రామంలో గిరిజనుల జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలను ట్రెయినీ ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయగా శుక్రవారంతో ముగిసింది. వీరు గత ఆదివారం రిమ్మ గ్రామానికి చేరుకోగా గిరిజనుల జీవన స్థితిగతులుపై అధ్యయనం చేశారు. అధికారులకు గిరిజనులు ఆప్యాయతతో వీడ్కోలు పలికారు.

పెళ్లయిన నాలుగు నెలలకే కడతేర్చాడు

- 20 నిమిషాలకే రోడ్డు ప్రమాదంలో నిందితుడు దుర్మరణం
- అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త
- ఆదిలాబాద్ జిల్లా బంగారుగూడలో ఘటన
- ఇరు కుటుంబాల్లో విషాదం



సంఘటన స్థలంలో అరుణ్ మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: పెళ్లైన నాలుగు నెలలకే ఆ సంసారంలో అనుమానం పెనుభూతంగా మారింది. మూడు ముళ్లు.. ఏడు అడుగులు వేసి చివరి వరకూ తోడుగా ఉంటానని బాస చేసిన భర్తే.. అతికిరాతకంగా భార్యను హత్య చేశాడు. ఆపై పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడానికి వెళ్తూ.. ఆగి ఉన్న లారీని ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ విషాద సంఘటనలు ఆదిలాబాద్ జిల్లా బంగారుగూడలో జరిగాయి. ఆ రెండు కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణానికి సమీపంలోని బంగారుగూడకు చెందిన జయవంత్‌రావు-పద్మ దంపతులకు ఏకైక కుమారుడు మోహితే అరుణ్(30)కు నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన గోపిచంద్-లక్ష్మి దంపతుల చిన్న కూతురు దీప(22)తో నాలుగు నెలల క్రితం వివాహం చేశారు. దీప తల్లిదండ్రులు కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అష్టకష్టాలు పడి కూతురు వివాహం చేసి ఆనందపడ్డారు. పెళ్లయిన నాటి నుంచి భార్యపై అరుణ్ అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆషాఢమాసం కావడం, భార్య పుట్టింటికి వెళ్లి నాలుగు రోజుల క్రితమే తిరిగి అత్తింటికి వచ్చింది. భార్యపై కక్ష్య పెంచుకున్న అరుణ్ శుక్రవారం తెల్లవారుజామున దీప తలను మంచానికి బాది అత్యంత కిరాతకంగా హత్య చేశాడు.

లొంగిపోదామని..

అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోవడానికి ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బైక్‌పై బయలుదేరాడు. అరుణ్ తల్లిదండ్రులు పద్మ, జయవంత్‌రావు విగతజీవిగా పడి ఉన్న కోడలును చూసి ఆందోళనకు గురయ్యారు. కొడుకు ఇంటి వద్ద కనిపించకపోవడంతో ఫోన్ చేశారు. రూరల్‌పోలీస్ స్టేషన్ వైపు వెళ్తున్నట్లు ఫోన్‌లో చెప్పగా వెంటనే తిరిగి ఇంటికి రావాలని కోరారు. దీంతో అతడు బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఇంటికి తిరిగి వస్తాడనుకున్న కొడుకు మృతిచెందాడనే వార్త వినగానే తల్లిదండ్రులు మరింత షాక్‌కు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు దీప ఇంటికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అలాగే అరుణ్ తల్లిదండ్రులను సైతం పోలీసులు విచారించగా కొన్నిరోజులుగా కుటుంబ కలహాలు ఉన్నాయని పోలీసులకు తెలిపారు. ఇదిలా ఉండగా కూతురు హత్యకు గురైన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు లక్ష్మి, గోపిచంద్ రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని విలపించిన తీరు అక్కడి వారిని కదిలించింది. కాగా మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అరుణ్ తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ వివరించారు. అలాగే అరుణ్ మృతికి కారణమైన లారీ ఓనర్‌పై ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్‌లో కేసు నమోదైంది.

ఫ్రెషర్స్.. హుషారు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో 'లా ఫియెస్టా సావనీర్ 22' పేరిట మెడికల్ మొదటి సంవత్సరం విద్యార్థులు శుక్రవారం రాత్రి ఫ్రెషర్స్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా మానసిక ఉల్లాసం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని అన్నారు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా స్నేహభావంతో మెలగాలని కోరారు. రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్ పాల్గొన్నారు.



కేరింతలు కొడుతున్న విద్యార్థులు



నృత్యం చేస్తున్న మెడికో విద్యార్థినులు